నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | VIKARABAD



మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్‌ను ఎర్రవల్లి నివాసంలో కొడంగల్ మాజీ శాసనసభ్యుడు పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ దుద్యాల్ మండల యూత్ ప్రెసిడెంట్ లగచర్ల సురేశ్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. లగచర్ల సంఘటన, పార్టీ నాయకులు, కార్యకర్తల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని.. ఎవ్వరు కూడా అధైర్యపడవద్దని కేసీఆర్ సూచించినట్లు వారు తెలిపారు. - బొంరాస్‌పేట్, ఏప్రిల్ 5

## అదనపు బోగీలు ఇంకెప్పుడు?

సిటీబ్యూరో : హైదరాబాద్ మెట్రోకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఇంకా కార్యరూపంలోకి రాలేదు. పెరుగుతున్న రద్దీకను గుణంగా నగరవాసులకు అదనపు బోగీలతో మెరుగైన రవాణా సదుపాయం కల్పిస్తామంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన ప్రకటన కాగితాలకే పరిమితమైంది. ఈ విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఓ సమావేశంలో మంత్రి తెలిపారు. కానీ ఇప్పటికీ ఎల్ అండ్ టీనీ ఆదేశించింది లేదు.. కొత్త బోగీలను తెచ్చిందీ లేదు.

### రద్దీకి పరిష్కారం..

రద్దీగా ఉండే మార్గాల్లో తొలి దఫా అదనపు బోగీలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. అమీర్‌పేట, రాయదుర్గం, జేబీఎస్ పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ వంటి స్టేషన్లకు నాలుగు అదనపు కోచ్‌లను నాగ్‌పూర్, పుణె మెట్రో నుంచి లీజుకు తీసుకునేలా ప్రతిపాదించారు. గడిచిన కొంతకాలంగా నిత్యం ఐదున్నర లక్షలకు పైగా ప్రయాణం చేస్తున్నారు. ఆఫీసు సమయాల్లో నాగోల్-రాయదుర్గ్ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కిక్కిరిసిన జనాలతో స్టేషన్లన్నీ నిండిపోతున్నాయి. అయినా బోగీలు అందుబాటులో లేకపోవడంతో.. మరో రైలు వచ్చేంత వరకు ప్లాట్‌ఫాంపై ఎదురుచూసే వారి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఏడాదిన్నర కాలంగా బోగీలను పెంచాలనే డిమాండ్ చేస్తున్నా.. అటు మెట్రో కానీ, ఎల్ అండ్ టీ కానీ పట్టించుకోవడంలేదు.

## ఫార్మా బాధిత రైతులకు అండగా బీఆర్ఎస్

**బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 5 : ఫార్మా భూబాధిత రైతులకు ప్లాట్ల పొజిషన్ చూపించిన తర్వాతే ఫార్మా భూములకు కంచెను ఏర్పాటు చేయాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి, నక్కర్తతో పాటు పలు గ్రామాల్లో రైతుల నుంచి సేకరించిన భూములకు కంచె వేసేందుకు కాంగ్రెస్ సర్కారు మూడు నాలుగు వందల మంది పోలీసులను పెట్టి కంచె వేయిస్తూ రైతులను అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో రైతులకు భూ పరిహారంతో పాటు ఇంటి స్థలాలను కూడా అందజేసేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దాటవేత ధోరణి అవలంబించడం సరికాదన్నారు. అలాగే, ఫ్యూచర్ సిటీ పేరుతో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు భూ బాధితులకు పరిహారం ధర నిర్ణయించకుండానే టెండర్లు పిలవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎలాంటి ఇబ్బందులున్నా సామరస్యంగా రైతులతో మాట్లాడి పరిష్కరించాలని.. అంతేకాని అమాయకపు రైతులు, ప్రజల పట్ల పోలీసు జులుం ప్రదర్శిస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. నిన్న మొన్నటి వరకు హెచ్‌సీయూ, లగచర్ల భూముల విషయంలో చేసిన మాదిరిగా ఇబ్రహీంపట్నం గడ్డపై ఇలాంటి చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గత ఎన్నికల సమయంలో భట్టివిక్రమార్క, సీతక్క, కోదండరెడ్డి, కోదండరాంరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రగల్బాలు పలికి ఇప్పుడు రైతులకు న్యాయం చేయకుండా.. ఇక్కడ ఫార్మా సిటీ లేక ఇంకేదైనా ఏర్పాటు చేస్తారా చెప్పకుండా దాగుడు మూతలు ఆడటం సరైన పద్ధతి కాదన్నారు. రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆపేది లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులున్నారు.

# అదనపు కూలీకి ఎగనామం

## గతేడాది నుంచి ఆపేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఈ ఏడాది అధికారికంగా అదనపు కూలీ లేదని చెబుతున్న అధికారులు
- ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30 శాతం అదనపు కూలీ డబ్బులను పదేళ్లపాటు చెల్లించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



వికారాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాల అమల్లోకి తీసుకువస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలను మోసం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్బండ వర్గాల సంక్షేమం కోసం ఆసరా, కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్స్ తదితర పథకాలను అమలు చేసి ఆపద్బాంధవుడిలా కేసీఆర్ పేరొందితే, అధికారం చేపట్టిన ఏడాదికే అన్ని వర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుండడం గమనార్హం. చివరకు ఉపాధి హామీ కూలీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. గ్రామీణ ప్రాంతంలో పేదరికాన్ని రూపుమాపేందుకు అమల్లోకి తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో పూర్తిగా నిర్వీర్యమవుతున్నది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.వేల కోట్లు కేటాయించామని ప్రచారం చేసుకోవడం తప్ప చేసిందేమీ లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా వేసవిలో ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే అదనపు వేతనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు వేసవిలో అదనపు వేతనాన్ని అందించి కూలీలకు అండగా నిలువగా, రేవంత్ ప్రభుత్వం మాత్రం గతేడాది ఇస్తామంటూ మే వరకు పొడిగిస్తూ పోయి చివరకు అదనపు వేతనాన్ని కూలీలకు అందించలేకపోయింది. ఈ ఏడాది అయితే అదనపు వేతనం వస్తుందని మార్చి మొదటి వారం నుంచి ఎదురుచూస్తున్న కూలీలకు.. ఈ ఏడాది అదనపు వేతనం పూర్తిగా బంద్ చేసినట్లు అధికారులు తేల్చి చెబుతుండడం గమనార్హం. దీనిపై కూలీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

### కక్ష సాధింపు చర్యలు

పేద కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. గత మూడేళ్లుగా లక్షల్లో పని దినాలను తగ్గించి పేదల కడుపు కొడుతూ ఉపాధి హామీ పథకంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వస్తున్నది. కేవలం మూడేళ్లలోనే దాదాపు 50 లక్షల పనిదినాలను తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా బంద్ చేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళ్తుండగా.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

### అదనపు వేతనం నిలిపివేత

ప్రతి ఏటా వేసవిలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు అదనపు కూలీ డబ్బులను కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తున్నది. వేసవిలో భానుడి ప్రతాపంతో అధిక సమయం పనిచేయలేరు, దీంతోపాటు మండే ఎండలోనూ ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న దృష్ట్యా అదనంగా కూలీ డబ్బులను పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో ఎండలు విపరీతంగా ఉంటాయి కాబట్టి ఈ రెండు మాసాల్లో అధిక మొత్తంలో అదనపు కూలీ ఇస్తూ వచ్చారు. ఫిబ్రవరి నెల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉపాధి హామీ కూలీలకు అందజేసే వేతనాన్ని ఫిబ్రవరిలో 20 శాతం అదనంగా, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం అదనంగా చెల్లిస్తూ వస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అదనపు వేతనాన్ని నిలిపివేసినట్లు అధికారులు చెబుతుండడం గమనార్హం.

### ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.150 కోట్ల చెల్లింపులు

మరోవైపు ప్రతి ఏటా ఫిబ్రవరి రెండో వారంలోగా అదనపు కూలీ ప్రకటన వస్తున్నప్పటికీ గత రెండేళ్లుగా అదనపు కూలీ డబ్బుల ప్రకటన రాకపోవడంతో ఉపాధి హామీ కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 67.37 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటివరకు 60 లక్షల పని దినాలను జిల్లా యంత్రాంగం కల్పించింది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు రూ.300 కూలీ డబ్బులను అందజేస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకుగాను ఇప్పటివరకు రూ.150 కోట్ల వరకు చెల్లింపులను పూర్తి చేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా 2,00,372 ఉపాధి హామీ కుటుంబాలుండగా.. 4,38,398 మంది కూలీలున్నారు.

# ఎండిన పంటలు.. మిగిలిన అప్పులు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఎండుతున్న చెరువులు, బోర్లు, బావులు
- చెరువులు, కాలువలకు సర్కారు పూడిక, మరమ్మతులు చేయకపోవడంతోనే ఈ దుస్థితి
- పంటలకు నీరందక భయాందోళనలో రైతులు
- పంటలను కాపాడుకునేందుకు ముప్పతిప్పలు
- పెట్టుబడి కూడా రాదని అన్నదాతల ఆందోళన
- బీఆర్ఎస్ హయాంలో సకాలంలో అందిన పెట్టుబడి సాయం
- కంటితుడుపుగా కొంతమందికి మాత్రమే రైతు భరోసా అందించిన కాంగ్రెస్ సర్కారు
- తమను ఆదుకోవాలని కోరుతున్న రైతులు



కులకచర్ల : కామునిపల్లిలో కాముని చెరువు ఎదుట ఎండుముఖం పట్టిన వరి పంట

పరిగి/కులకచర్ల, ఏప్రిల్ 5 : బోర్లలో రోజురోజుకూ తగ్గుతున్న నీటితో పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం రాలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఎప్పటిలాగే కష్టపడి సాగు చేసిన వరి పంట ఈసారి తమను ఆదుకుంటుందనుకుంటే పెట్టిన డబ్బులు వచ్చే పరిస్థితి లేదని వారు పేర్కొంటున్నారు. వరి పంటలు ఎండిపోవడంతో వాటిలో పశువులను మేపుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో వేసవిలో కూడా నీరు పుష్కలంగా ఉండి పంటలు పూర్తి స్థాయిలో పండి రైతులకు కన్నీరు లేకుండా సంతోషంగా ఉండేవారు. కాని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పంటల ప్రణాళికలు లేక బోర్లద్వారా, బావుల కింద పంటలు వేశారు. సర్కారు చెరువులు, కాలువలకు పూడిక, మరమ్మతులు చేయకపోవడంతో వేసవి కాలం ప్రారంభంలోనే వరి పొలాలు ఎండుముఖం పడుతుండటంతో గ్రామాల్లో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటలు సాగుచేయడానికి ఇతరుల వద్ద తీసుకొచ్చిన అప్పులెలా తీర్చాలో తెలియక సతమతమవుతున్నారు. పరిగి, కులకచర్ల మండలాల్లో చాలా వరకు రైతులు చెరువులు, బావుల కింద, బోర్ల సాయంతో వరిని సాగుచేశారు. పంటలు వేసిన నెల రోజులకే పంటలకు నీరందక బోర్లు, బావుల్లో నీళ్లు పూర్తిగా తగ్గిపోవడంతో తాము వేసిన పంటలను ఎలాగైనా కాపాడుకునేందుకు ప్రతి రెండు రోజులకు ఒకసారి వచ్చే నీటిని పెడుతూ రాత్రింబవళ్లు కృషిచేస్తున్నారు. వారి పంటలకు నీరు అందకపోతే పక్క పొలాల రైతుల బోర్ల నుంచి నీటిని అడిగి పంటలకు అందిస్తున్నారు. ఇలాంటి కష్టాలను గతంలో ఎప్పుడూ పడలేదని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వం పంట వేసే సమయానికి సరైన సమయానికి రైతుల ఖాతాల్లో రైతు బంధును జమచేసేది. దీంతో ఎలాంటి భయం లేకుండా పంటను సాగుచేసేవారు. కాని కాంగ్రెస్ సర్కారు వచ్చిన తరువాత రైతు భరోసా బంద్ చేసి కేవలం కంటి తుడుపుగా మాత్రమే కొందరికి మాత్రమే అందిస్తూ చాలా మంది రైతులను కన్నీరు పెట్టిస్తున్నది. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పంటలను కాపాడేందుకు ఇబ్బందులు



రైతులు పండించిన పంటను కాపాడుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల్లో నీళ్లు పూర్తిగా ఎండిపోవడంతో బోర్లలో కూడా నీటి శాతం తగ్గి వేసిన పంటలకు నీరు అందక కొంతమేర వచ్చే ప్రతి రెండు రోజులకోసారి కొంత పొలానికి నీటిని అందిస్తూ పూర్తి స్థాయిలో ఎండిపోకుండా ఉండేందుకు కష్టపడుతున్నారు. పంటలు చేతికి రావడానికి కనీసం 20 నుంచి 30 రోజుల సమయం పడనుండగా.. ఆ సమయానికి పంట చేతికి వస్తుందా అనే సందేహం ప్రతి రైతుకూ ఉన్నది. దీనికి ప్రధాన కారణం పంటలపై రైతులకు అధికారులు పూర్తి స్థాయి అవగాహన కల్పించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ముందుగానే అధికారులు ప్రణాళికలకు తయారుచేసి దానికి అనుగుణంగా పంటలు వేయాలని చెప్పేవారు.. కాని నేడు ఈ విషయంపై అధికారులు కాని, ప్రభుత్వం కాని ఎలాంటి సూచనలు, సలహాలివ్వలేదు. గతంలో అదునుకు రైతు బంధు వచ్చి పంటలకు పెట్టుబడి ఇబ్బంది ఉండేదికాదు.

- చాకలి అంజిలయ్య, మాజీ సర్పంచ్, బొంరెడ్డిపల్లి

### పెట్టుబడి సైతం రాని పరిస్థితి

పరిగి మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన కాకి రమేశ్ తన పొలంలో కూరగాయలు సాగు చేపట్టగా.. పక్కనే ఉన్న 3 ఎకరాల భూమిని ఎకరాకు రూ.5వేల చొప్పున కౌలుకు తీసుకున్నాడు. ఈ మూడు ఎకరాల్లో వరి సాగు కోసం తన ట్రాక్టర్‌తోనే దున్నడం, కరిగెట తదితర పనులు చేయగా.. విత్తనాలు, నాట్లు వేయడం, ఎరువులకు సుమారు రూ.60వేల వరకు ఖర్చు చేశాడు. 2 బోర్లు ఉండగా నీరు పూర్తిగా తగ్గిపోవడంతో కొన్ని రోజులుగా వరి పంట ఎండిపోతున్నది. దీంతో ఒక బోరులో ఫ్లషింగ్ చేయించి, కొత్త కేసింగ్ వేసేందుకు రూ.1.75 లక్షలకు పైగా వెచ్చించాడు. మొదట్లో కొంత నీరు వచ్చినా భూగర్భ జలాలు అడుగంటడంతో నీరు పూర్తిగా తగ్గిపోయి పంట ఎండిపోయింది. తద్వారా పెట్టిన పెట్టుబడి, బోరు ఫ్లషింగ్ తదితర వాటికి కలిపి సుమారు రూ.3లక్షల వరకు ఖర్చయిందని, కళ్ల ముందే వరి పంట ఎండిపోతుండడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఎండిన వరి పంట పొలంలో పశువులను మేపుతున్నట్లు తెలిపాడు. ఎంతో కొంత వరి పంట ఆదుకుంటుందనుకుంటే ఇలా జరగడమేంటని రైతు కుటుంబం దిగాలు చెందుతున్నది. సర్కారు తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.





### 3 ఎకరాల్లో ఎండిన వరి పంట

పరిగి మండలం రంగంపల్లి గ్రామానికి చెందిన వెల్చాల అనంతయ్య, అతడి కుమారుడు పాండు సాగు చేసిన వరి పంట ఎండిపోయింది. 3 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా పెట్టుబడికి రూ.60 వేలకు పైగానే ఖర్చయిందని రైతులు తెలిపారు. గత సంవత్సరమే రూ.2.80 లక్షలు వెచ్చించి రెండు బోర్లు వేయిస్తే ఒక దాంట్లో నీరు సన్నగా వచ్చిందన్నారు. ఎలాగోలా ఈసారైనా వరి సాగుతో పెట్టుబడి ఖర్చులుపోను ఎంతో కొంత డబ్బులు చేతికి అందుతాయని ఆశించి పంట సాగు చేయగా బోరులో నీరు పూర్తిగా తగ్గిపోయింది. తద్వారా వరి పంట ఎండిపోయింది. పూర్తిగా నెర్రెలు వారి పంట చేతికి వచ్చే పరిస్థితి కరువైంది. 3 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి పూర్తిగా ఎండిపోవడంతో ఏమీ పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో కేసీఆర్ పాలనలోనే సాగు బాగుండేదని, నేడు వ్యవసాయానికి ఈ పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వమైనా తమను ఆదుకొని నష్టాల నుంచి గట్టెక్కించాలని వారు కోరుతున్నారు.

# సన్న బియ్యం నో స్టాక్

- రేషన్ షాపునకు వచ్చి వెనుదిరిగిపోతున్న లబ్ధిదారులు
- సగం మందికే బియ్యం అందజేసిన డీలర్లు



బియ్యం లేక ఖాళీగా కూర్చున్న డీలర్

వికారాబాద్, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఉగాది పండుగ నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. వికారాబాద్ మున్సిపల్‌తోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలు, వార్డుల్లో కొన్ని రేషన్‌షాపుల్లో సన్న బియ్యం లేక లబ్ధిదారులు వెనుదిరిగిపోతున్నారు. సన్న బియ్యం పథకం ప్రారంభించిన ఒక రోజు, రెండు రోజులకే బియ్యం అయిపోయాయి అని రేషన్ డీలర్లు సమాధానం చెబుతున్నారు. రేషన్ షాపులకు రావాల్సిన బియ్యం మొత్తం రాకుండా సగం వరకు అందించడంతో త్వరగా బియ్యం అయిపోయి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో షాపునకు దాదాపు 45 నుంచి 50 క్వింటాళ్ల వరకు రావాల్సి ఉండగా.. 20 క్వింటాళ్లు రావడంతో లబ్ధిదారులకు సన్న బియ్యం పథకం అందడం లేదు. రెండు, మూడు రోజులు బియ్యం పంపిణీ చేసి ఆతర్వాత షాపులను మూసివేస్తున్నారు. అదనపు కోటా కోసం సంబంధిత అధికారులకు సమాచారం అందించినా ఆలస్యంగా వస్తున్నాయి. దీంతో సన్న బియ్యం పథకం పూర్తిగా నీరుగారుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు.

# సమ్మర్‌కు అరకొరగా ప్రత్యేక రైళ్లు




హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సమ్మర్ కోసం అరకొరగానే ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఇవి వేసవి కాలంలో ప్రయాణించేవారి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. దీనికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేసవి రద్దీని సరిగా అంచనా వేయకుండానే ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్లు ఏ మాత్రమూ సరిపోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్మీడియట్‌తోపాటు టెన్త్‌క్లాస్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. పైగా వేసవి సెలవులు వచ్చాయి. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలతోపాటు అధిక సంఖ్యలో ప్రయాణాలు మొదలయ్యాయి. వేసవి అవసరాల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్లలో ప్రయాణికులకు అవసరమైన వసతులు, ముఖ్యంగా నీటి సదుపాయాలు కల్పించకపోవడంతోపాటు ప్రత్యేక రైళ్లలో అపరిశుభ్రత తాండవిస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

### ప్రయాణికులతో రైల్వే స్టేషన్లు కిటకిట

ఇంటర్, టెన్త్‌క్లాస్ పరీక్షలు పూర్తి కావడం, వేసవి సెలవులు రావడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్య సహజంగానే పెరుగుతుంది. దీంతో రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీ సాధారణం కంటే ఎక్కువ మొత్తంలో నమోదవుతుంది. ప్రయాణికుల శ్రేయస్సు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న రైల్వే అధికారులు.. వారి అవసరాలు తీర్చే విషయంలో మాత్రం ససేమిరా అంటున్నారు. పైగా సాధారణ రైలు చార్జీల కంటే.. అదనంగా దాదాపు 50 శాతం వరకు చార్జీలు పెంచుతున్నారు. తెలిసీ తెలియని ప్రయాణికులపై రైల్వే చార్జీల బాదుడుతో వారంతా ఆవేదన వ్యకం చేస్తున్నారు. రద్దీ పేరుతో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తూ, వారిలో సరైన వసతులు కల్పించకుండా, జనరల్ టికెట్ చార్జీలపై అదనంగా 50 శాతం వరకు చార్జీలు గుంజుతున్న రైల్వే శాఖ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.